క్లుప్తంగా

ప్రజలందరికీ శుభాలు కలగాలి



వెంకటగిరిరూరల్: వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజలందరికీ శుభాలు కలగాలని కోరుకుంటూ ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

గూడలిలో వాలీబాల్ పోటీలు

కోట: గూడలిలో వైఎస్సార్‌సీపీ నేత వేమారెడ్డి షనీల్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20, 21 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాగార్జున, నాగరాజు తెలిపారు. వివరాలకు 9848769064, 8179158665 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఓజిలి: ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఉన్నత పాఠశాలలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు అపూర్వ, చాందిని 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 23 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఎండీ గౌరీశంకర్, సీఈఓ సీతారామనాయుడు, ఏఓ కృష్ణగల్లా పాల్గొన్నారు.

కండలేరులో 12.772 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 12.772 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 845 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 25, లోలెవల్ స్లూయిజ్‌కు 50క్యూసెక్కుల వంతున విడుదలచేస్తున్నట్లు ఆయన వివరించారు.

సంఘటితంగా ఉండాలి



సమావేశంలో యాదవ సంఘ నేతలు

గూడూరురూరల్: రాష్ట్రంలోని యాదవులు తమ సమస్యలు పరిష్కరించుకునే క్రమంలో సంఘటితంగా పోరాడాలని అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరావ్ అన్నారు. స్థానిక గంగమ్మ ఆలయంలో ఆదివారం యాదవ మహా సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, గౌరవాధ్యక్షుడు వేణు, మైథిలీ ఆస్పత్రి చైర్మన్ రమణబాబు, నియోజకవర్గం అధ్యక్షుడు వంకా రమణయ్య, మునిరాజా యాదవ్, సుబ్రహ్మణ్యం, కిషోర్ పాల్గొన్నారు.

మట్టి వినాయకున్ని పూజిద్దాం



అవగాహన కల్పిస్తున్న కళాశాల బృందం

వెంకటగిరిరూరల్: పర్యావరణాన్ని రక్షించుకునేందుకు మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు అవగాహన కల్పించారు. ఫోర్త్ సెమ్ కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టులో భాగంగా ఆ కళాశాల హెచ్‌ఓడీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుని పూజిద్దాం.. అనే నినాదంతో పట్టణంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ, ఎస్‌ఐ నరసింహారావు, పట్టణంలోని పలు పాఠశాలలు, పలువురు కౌన్సిలర్ల వద్దకు వెళ్లి మట్టి వినాయకుని పూజించాలని అవగాహన కల్పించారు.

జాబ్‌మేళాలో 30 మంది ఎంపిక



మాట్లాడుతున్న డయ్‌కిన్ కంపెనీ హెచ్ఆర్

సూళ్లూరుపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో శ్రీసిటీలోని డయ్‌కిన్ కంపెనీలో ఉద్యోగాలు చేసేందుకు 30 మందిని ఎంపిక చేశామని కంపెనీ హెచ్ఆర్ అరుణ్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో 30 మందిని ఎంపిక చేశారు. జాబ్ మేళాకు ప్రిన్సిపల్ డాక్టర్ శంకరశర్మ, జేకేసీ కోఆర్డినేటర్ యలమందరావు సహకరించారని వారికి హెచ్ఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

పూజకు వేళాయె!



సైదాపురం: గణపయ్య



గూడూరు: పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు

- వినాయక చవితికి సర్వం సిద్ధం
- విగ్రహాల తరలింపులో యువత సందడి

గూడూరురూరల్: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణంలో ఆదివారం చవితి సందడి నెలకొంది. పట్టణ పురవీధులు వినాయక ప్రతిమలు, పూజాసామగ్రి, పూలు, పండ్లు దుకాణాల వద్ద జనం కిక్కిరిసిపోయారు. వినాయక చవితి పండుగను వైభవంగా నిర్వహించుకునేలా ప్రజలు పండుగకు అవసరమైన వస్తు సామగ్రిని దుకాణాల వద్ద పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. వివిధ మండలాల నుంచి వచ్చిన యువత పోటాపోటీగా భారీ వినాయక విగ్రహాలను పట్టణ సమీపంలోని తయారీ కేంద్రాల నుంచి కొనుగోలు చేసి వాహనాల్లో విగ్రహాలను పెట్టుకుని గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లారు. పండుగను పురస్కరించుకుని పూలు, పండ్లకు డిమాండ్ పెరగడంతో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని పలువురు పేర్కొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: వినాయకచవితి పురస్కరించుకుని పట్టణంలో సందడి నెలకొంది. వాడవాడలా వినాయకుడి విగ్రహాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మున్సిపల్ అధికారులు చెంగాళమ్మ ఆలయం సమీపంలోని కాళంగి నదిలో ఏర్పాట్లు చేస్తున్నారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో చవితి ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశారు. విగ్రహాలను కొలువుదీర్చేందుకు ప్రత్యేక మండలపాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు.



గూడూరు: విగ్రహాలను తీసుకెళుతున్న యువత



వెంకటగిరి: విగ్రహాన్ని తీసుకెళుతూ..

చిల్లకూరులో..

చిల్లకూరు: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల్లో పెద్ద ఎత్తున పండుగను ఘనంగా జరుపుకునేలా యువత సన్నాహాలు చేస్తుంది. చిల్లకూరు మండలంలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు కోసం యువత ఆదివారం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. నాయుడుపేట, శ్రీకాళహస్తి పట్టణాల నుంచి పలు ప్రాంతాలకు గణనాథుని విగ్రహాలను తరలించారు.

సైదాపురంలో..

సైదాపురం: మండలంలో వాడవాడలో వినాయకచవితి పండుగకు సర్వం సిద్ధం చేశారు.

వెంకటగిరిలో పండుగశోభ

వెంకటగిరిరూరల్: వినాయకచవితి పురస్కరించుని పట్టణంలో పండుగ శోభ నెలకొంది. పండుగ వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలతో ఎగబడ్డారు. వినాయక విగ్రహాలను తీసుకెళ్తూ యువత సందడి చేశారు.



సూళ్లూరుపేట: షార్ బస్టాండ్ వద్ద మండపం

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: పట్టణంలో వినాయకచవితి సందడి నెలకొంది. పట్టణంలోని పలు ప్రాంతాలలో విగ్రహాలు ఏర్పాట్లు చేసుకునేందుకు వాహనాల్లో విగ్రహాలను తరలించుకుని పోతున్నారు. వినాయక చవితి వస్తువులు కొనుగోలు చేసే దుకాణాల వద్ద సందడి నెలకొంది.



రాపూరు: విద్యుత్ దీపాలంకరణలో శివాలయం



చిల్లకూరు: ట్రాక్టర్‌లో తరలి వెళుతున్న గణపయ్య



నాయుడుపేట: కొనుగోలు సందడి

తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకోండి

సైదాపురం: మండల వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు పోస్టులు పెట్టేవారిపై చర్యలు తీసుకోవాలంటూ సైదాపురం గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం సైదాపురం ఎస్‌ఐ చల్లావాసుకు ఫిర్యాదు చేశారు. అసత్య పోస్టులను పెడుతూ వైఎస్సార్‌సీపీపై బురదచల్లే కొందరు నాయకులపై కేసును నమోదు చేయాలన్నారు. ఆ పోస్టుపై సమగ్ర విచారణ చేసి తప్పుడు పోస్టును సృష్టించిన నాయకుడిపై రౌడీషీటర్ కూడా నమోదు చేయాలని కోరారు. విచారణ చేసి న్యాయం చేస్తామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు.



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న నేతలు

మట్టి విగ్రహాల పంపిణీ

గూడూరురూరల్: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఆదివారం డాక్టర్ రోహిణి దాతృత్వంతో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, సిద్ధారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, సనత్‌కుమార్ రెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హరినాథ్ రెడ్డి, సురేష్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న దాతలు

నృసింహుని చందనాలంకరణ రేపు

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి మూలమూర్తి మంగళవారం చందనాలంకరణలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆరోజు స్వామివారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారికి ఉదయం 4గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతిహోమం, 10గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.



పెంచలకోన క్షేత్రం

అలరించిన కూచిపూడి

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం అలరించింది. మదనపల్లికి చెందిన శ్రీసూర్య డాన్స్ అకాడమీ, నాట్య గురువు సూర్య ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి, ఫోక్ డాన్స్ ఆకట్టుకుంది. కళాకారులు లిపికశ్రీ, వైష్ణవి, పల్లవి, భవ్యశ్రీ, ప్రజ్ఞ, ప్రణతి, యాశ్విత, హర్షిత, హిమణి, శ్రావణిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.



నృత్యాలతో అలరిస్తున్న కళాకారులు

కళాయజ్ఞ పెయింటింగ్ ప్రదర్శనకు విశేష స్పందన



బహుమతులు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్: శ్రీకళాక్షేత్రం, తిరుపతి బాలోత్సవం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంయుక్తంగా రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద ఆదివారం చేపట్టిన కళాయజ్ఞ జీవన రేఖలు మోనోక్రోమాటిక్ పెయింటింగ్ ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ ప్రదర్శనను రీచ్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్ నాథ్ రింగుట్ల ప్రారంభించారు. ప్రముఖ చిత్ర కారుడు శేషబ్రహ్మ, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కన్వీనర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ 21 రోజుల పాటు రోజుకు ఒక కాన్సెప్ట్‌తో కళాయజ్ఞ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కిరణ్‌కాంత్ చౌదరి చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. తిరుపతి బాలోత్సవం ప్రతినిధులు నాగార్జున, టింకాయల దామోదరం, నడ్డి నారాయణ, ఎస్. రెడ్డెప్ప, గురునాథం, ముఖేష్ మురళి, తహసున్నీసా, లావణ్య, రత్నశేఖర్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ గిరిధర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు మహా నైవేద్యం



నైవేద్యం తీసుకొస్తున్న కమిటీ సభ్యులు

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మహా నైవేద్యం సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవను నిర్వహించిన అనంతరం అభిషేకాలు చేసి అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఆలయ ట్రస్టు కమిటీ సభ్యులు నైవేద్యం సమర్పించారు.

అనువాద ప్రచురణల ఆవిష్కరణ



ప్రార్థనలతో చర్చి కమిటీ సభ్యులు

చిల్లకూరు: క్రైస్తవుల ఆరాధన గ్రంథం నుంచి కొన్ని పుస్తకాలను అనువాదం చేసి వాటిని ఆదివారం ప్రార్థన సమయంలో ఆవిష్కరించారు. కమ్మవారిపాళెం గ్రామంలో ఉన్న లోగోస్ లూథరన్ చర్చిలో క్రైస్తవులు ముందుగా ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బైబిల్‌లోని థెస్సలోనికయలోని మొదటి పత్రిక అనువాదాన్ని చికాగో తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరులు రెవరెండ్ గోను రామణి (యూఎస్ఏ) చేతుల మీదుగా ఆవిష్కరించి ప్రతులను అందరికి అందజేశారు.

20న ఉచిత కంటి వైద్యశిబిరం

నాయుడుపేటటౌన్: భగవతి మల్లికాంబ అమ్మవారి ఆలయం వద్ద ఈనెల 20న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అమాస రామనారాయణ ఆదివారం తెలిపారు. చెన్నైకు చెందిన శంకర నేత్రాలయం వైద్యుల సౌజన్యంతో 20 తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు ప్రజలను కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వెంకటగిరిరూరల్: పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్ఈబీ సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ నరసింహారావు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.4,200 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుఖసంతోషాలతో తులతూగాలి



నాయుడుపేటటౌన్: ప్రజలకు విఘ్నాలు తొలిగిపోయి సుఖసంతోషాలతో తులతూగాలని కోరుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికి శుభాలు కలగాలని విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలు ఉండాలని కోరుతూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



విశ్వకర్మ భగవాన్‌కు పూజలు

సూళ్లూరుపేట: పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వారి కులదైవమైన విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. విశ్వకర్మ భగవాన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. మాధవయ్య ఆచారి, భాస్కర్ ఆచారి, వేణుగోపాల్ ఆచారి, చెంగయ్య ఆచారి, గిరి ఆచారి, మస్తాన్ ఆచారి, కృష్ణాచారి పాల్గొన్నారు.